క్లుప్తంగా

రాక్రేను కలిసిన అమరేందర్



మాణిక్‌రావు రాక్రేను సన్మానిస్తున్న అమరేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను బాలాపూర్‌కు చెందిన పీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి బొకే ఇచ్చి శాలువలతో సన్మానించారు. అలాగే ఏఐసీసీ కార్యదర్శి ఇన్‌చార్జి మన్సూర్ అలీని కూడా ఆయన కలిశారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించండి

బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శివకుమార్



తుక్కుగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల వారికి అందించే రూ.లక్ష రుణానికి దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారుల ఎంపికలతో పారదర్శకత పాటించాలని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శివకుమార్ అన్నారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి పార్టీలతో సంబంధం లేకుండా రుణం అందజేయాలని చెప్పారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

కౌన్సిలర్ రాజమౌని రాజు



బొమ్మలకుంట వాగులో ఘాట్ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ రాజు

తుక్కుగూడ: మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తాన్నాని కౌన్సిలర్ రాజమౌని రాజు అన్నారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో 14వ వార్డు పరిధిలోని బొమ్మలకుంట వాగులో బతుకమ్మ ఘాట్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని చెప్పారు. దసరా పండగ సందర్భంగా బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు రూ20 లక్షలతో ఈ ఘాట్‌ను నిర్మిస్తున్నామన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు నగరానికి తేజస్వినిరెడ్డి మృతదేహం



తేజస్వినిరెడ్డి(ఫైల్)

తుర్కయంజాల్: ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లి అక్కడ ఈ నెల 14వ తేదీన బ్రెజిల్‌కు చెందిన దుండగుడి చేతిలో హత్యకు గురైన పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన కొంతం తేజస్విని రెడ్డి (27) మృత దేహం ఎట్టకేలకు ఆదివారం నగరానికి చేరనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ఆదివారం ఉదయం 8 గంటల వరకు చేరుకుంటుందని సమాచారం. తేజస్వినిరెడ్డి హత్యకు గురైన విషయం తెలిసినప్పటి నుంచి ఆమె తల్లిదండ్రులు కొంతం శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవిలు కన్నీటి పర్యంతమవుతున్నారు. కూతురిని కడసారైన చూడాలనే ఆవేదనతో 10 రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం బ్రాహ్మణపల్లిలోని స్వగృహానికి మృతదేహం చేరాక అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం మంత్రి పర్యటించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.75లక్షల హెచ్ఎండీ నిధులతో 10 వార్డులో సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ సిట్టం, రూ.17లక్షల ఎంజీఎఫ్ నిధులతో ఉదయం 11గంటలకు ఆమె శంకుస్థాపన చేస్తారని చెప్పారు. మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు సకాలంలో హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ఆదివారం మంత్రి పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు ఆమె సంతాన వేణుగోపాల స్వామి ఆలయ సందర్శనకు వస్తున్నారని చెప్పారు.

రేపు పాఠశాలల బంద్

ఏబీవీపీ నేత సంజీవరెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యను వ్యాపారంగా మలుచుకొని పేద విద్యార్థులను మోసం చేస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రక్షాళన ఎప్పుడో..?

- మరమ్మతులకు నోచుకోని పులిందర్‌వాగు
- పరుచుకున్న గుర్రపుడెక్క
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

చిన్న నీటి వనరులు, వరద కాల్వల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని అతిపెద్ద వాగు పులిందర్. ఇది మరమ్మతులకు నోచుకోక వరద ప్రవాహం సాఫీగా సాగడం లేదు. దీనికితోడు గుర్రపు డెక్క పరుచుకుని దుర్వాసన వెదజల్లుతోంది.



పులిందర్ వాగులో పరుచుకున్న గుర్రెపుడెక్క

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని భాగ్ మంఖాల్ చెరువు నుంచి వరద మంఖాల్, తుక్కుగూడ గ్రామాల మీదుగా వరద నీరు రావిర్యాల పెద్ద చెరువులోకి వస్తుంది. ఇది సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉంటుంది. ఈ వాగును మరమ్మతులు చేపట్టాల్సిన ఇరిగేషన్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

కనిపించని వరద ప్రవాహం

వరుసగా కురుస్తున్న వర్షాలకు వస్తున్న వరద నీరు, మంఖాల్, తుక్కుగూడ, సర్దార్‌నగర్ డ్రైనేజీ నీరు, మంఖాల్ పారిశ్రామిక వాడ విషపు నీరు ఈ వాగు నుంచి రావిర్యాల పెద్ద చెరువుకు వస్తుంది. ప్రస్తుతం వాగు వరద కాల్వ పూర్తిగా గుర్రెపు డెక్క, జనుముతో నిండిపోయింది. నీటి ప్రవాహం కనిపించడం లేదు. గుర్రెపు డెక్కతో పాటు, వ్యర్థాలు చెరువులోకి రావడంతో విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోంది. ఈ వాసనకు రైతులు, ప్రయాణికులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విపరీతంగా పెరిగాయి.

సంరక్షణ చర్యలు చేపట్టేనా ?

పులిందర్ వాగులో గుర్రెపు డెక్క, జనుము తొలగించేందుకు ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇరు శాఖల అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుర్రెపు డెక్క, జనుము కారణంగా వరద సాఫీగా పోవడంతో లేదు. దీంతో పక్కన పంటపొలాలకు వరద నీరు పారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగులోని గుర్రపు డెక్కల తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వాగు శుభ్రం చేయాలి



మున్సిపాలిటీ పరిధిలోని పులిందర్ వాగు పూర్తిగా గుర్రెపు డెక్కతో మూసుకుపోయింది. మంఖాల్, తుక్కుగూడ గ్రామాల మురుగు రావడంతో వాగు, చెరువు నీరు పూర్తిగా దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించి వాగును శుభ్రం చేయాలి.

– భట్టు ధనంజయ, పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు

కొనసాగుతున్న రాజశ్యామల యాగం

హాజరైన నాయకులు



బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావుకు జ్ఞాపికను అందజేస్తున్న వీరేందర్‌గౌడ్

తుక్కుగూడ: లోక సంక్షేమానికి మాజీ హోం మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు చేపట్టిన చతురాయతన శత చండీ సహిత శ్రీ రాజశ్యామల మహా యాగం శనివారంతో మూడు రోజులకు చేరాయి. ఈ యాగానికి బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, స్థానిక నాయకులు హాజరయ్యారు. వీరిని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, పూరోహితులు సన్మానంనించి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తూళ్ల విజేయందర్‌గౌడ్, వినయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్‌డ కుటంబ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో ముదిరాజ్ జాతిని అవమాన పరిచినందుకు నిరసనగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు అంజయ్యముదిరాజ్, యూత్ అధ్యక్షుడు కొర్వి సురేందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయన్ను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లేష్ ముదిరాజ్, వెంకటేష్‌ముదిరాజ్, ఉదయ్‌ముదిరాజ్, శ్రీధర్‌ముదిరాజ్, జంగయ్య, మహేందర్, శ్రీనివాస్, లక్ష్మణ్, మల్లేష్, విఘ్నేష్, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న మహేశ్వరం ఏసీపీ అంజయ్య

ఏసీపీ అంజయ్య

పహాడీషరీఫ్: బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మహేశ్వరం ఏసీపీ సి.అంజయ్య సూచించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, కమిషనర్, వివిధ పార్టీల నాయకులతో శనివారం షాహీన్‌నగర్‌లో శనివాసం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా మున్సిపాలిటీ తరపున అందజేసే పెద్ద ప్లాస్టిక్ కవర్లలో వేసేలా స్థానికులకు అవగాహన కల్పించాలని కోరారు. మున్సిపాలిటీ సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో ఇంటింటికి కవర్లను అందజేయాలని సూచించారు. మేకలు, పొట్టేళ్ల విక్రయాలు రోడ్లపై కాకుండా ప్రత్యేక ప్రదేశాలలో విక్రయించాలని చెప్పారు. బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేకంగా పోలీసు నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. తుక్కుగూడలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పహాడీషరీఫ్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్లు కె.సతీష్, బి.వెంకట్‌రెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ ఎస్.వసంత, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, యాహ్యా, దస్తగిర్ తదితరులు పాల్గొన్నారు.

రంగుల ప్రాధాన్యత వివరించేందుకే 'రెడ్ డే'



మీర్‌పేట: ఎరుపు రంగు దుస్తుల్లో చిన్నారులు



బడంగ్‌పేట్: గ్రీన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని లార్డ్స్ హైస్కూల్‌లో శనివారం రెడ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు ధరించి హాజరైన విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు రంగుల ప్రాధాన్యతను తెలిపేందుకే ఈ వేడుక నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌లో రెడ్ కలర్ పడితే ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతాయని తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సిద్దాల శ్రీలత, అనురాధ, డీన్ సతీశ్ కుమార్, ప్రిన్సిపాల్ మీనారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రీన్‌డే సంబురం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని లార్డ్స్ స్కూల్‌లో శనివారం గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చెట్లను పెంచాలి పర్యావరణాన్ని కాపాడాలని నినదిస్తూ విద్యార్థులు పచ్చని ఆకులు చుట్టుకుని భూమాత దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.సంతోష్, డీన్ సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే

బడంగ్‌పేటలోని రాఘవేంద్ర కాలనీలోని లార్డ్స్ ఐఐటీ ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే సంబురాలను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌమరదశలో వస్తున్న మార్పులు అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మెమెంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు శ్రీహరి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్, కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రారంభిస్తున్న ధనంరెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: కాలనీలలో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గండు ధనంరెడ్డి అన్నారు. శనివారం కాలనీలోని లైబ్రరీ భవనంలో ఓజోన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యుల సమక్షంలో మధుమేహం, రక్తపోటు పరీక్షలతో పాటు క్లోవ్ డెంటల్ ఆసుపత్రి వైద్యులు దంత పరీక్షలు ఉచితంగా నిర్వహించి సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో డా.అరుణ, డా.సమీర్, వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, విజయ్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులను అరెస్టు చేయండి

సీపీఎం మండల కార్యదర్శి రవి కుమార్



దీక్ష చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మహేశ్వరం: పోరండ్ల ఉప సర్పంచ్ పెంజర్ల మల్లేశ్‌ని కులం పేరుతో దూషించిన పోరండ్ల సర్పంచ్ మచ్చ శకుంతల మహేందర్‌రెడ్డి దంపతులను అరెస్టు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అలువాల రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆత్మ గౌరవ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కుల పక్షపాతిగా మారిన నేరస్తులకు అండగా నిలుస్తూ దళితులను అణచివేస్తున్నారని ఆరోపించారు, వచ్చే ఎన్నికల్లో సబితమ్మకు రాజకీయ సమాధి కడుతామని హెచ్చరించారు. మల్లేశ్‌కు న్యాయం జరిగేంతవరకు ఉద్యమాన్ని ఆపమని చెప్పారు. సర్పంచ్ దంపతులను అరెస్టు చేయకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. అంతకు ముందు దీక్షా శిబిరాన్ని మహేశ్వరం ఏసీపీ అంజయ్య, ఎస్ఐలు సందర్శించి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బాబుమాదిగ, సీపీఐ నాయకులు గణేశ్, దళిత నాయకులు మహేందర్, కృష్ణయ్య, ప్రశాంత్, జంగయ్య, రవీందర్, కార్తీక్, జగన్, రమేశ్, రాజు, శేఖర్, సిద్దు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు వెరిఫికేషన్

సర్కిల్–3 డీసీ ఈఆర్ఓ మారుతీదివాకర్



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియతోపాటు ఒకే ఇంట్లో ఆరు కంటే ఎక్కువగా ఉన్న ఇండ్లు అపార్టుమెంట్లకు సంబంధించిన వెరిఫికేషన్ (సర్వే) పకడ్బందీగా జరుగుతోందని ఎల్‌బీనగర్ సర్కిల్–3 డీసీ, ఈఆర్ఓ మారుతీదివాకర్ తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుమారుగా 13748 ఇండ్లు, అపార్టుమెంట్లతో సుమారుగా 1,48,378 ఓటర్లు ఉన్నారని ఇప్పటికే గుర్తించామి పేర్కొన్నారు. 545 బూత్ లెవల్ అధికారులు ఈ సర్వేలో పాల్గొంటున్నారని, ఇంటింటికీ తిరుగుతూ ఈ సర్వే చేస్తున్నారని తెలిపారు. ఒకే ఫొటో కలిగి రెండు మూడు ఓటర్లు ఉన్నవారిని ఇప్పటికే గుర్తించామని వాటిని తొలగించేందుకు డిక్లరేషన్ తీసుకుని తొలగించాలని బీఎల్ఎలకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ముఖ్యంగా ఒకే ఇంట్లో ఆరుకుపైగా ఓటర్లు ఉన్నవారిని గుర్తించిన తర్వాత వారు అదే ఇంట్లో ఉంటున్నారా? లేక ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారా? అనే విషయంపై స్పష్టత తీసుకున్న తర్వాత బోగస్ ఓట్లు ఉంటే తనకు రిపోర్టు చేయాలని తెలిపారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించడంతోపాటు వేరే ప్రాంతంలో ఓట్లు ఉంటే వారిని గుర్తించి తొలగించాలని సూచించారు.

ఆరుకంటే ఎక్కువగా ఉంటే బై నంబర్

ఒకే ఇంట్లో ఆరుకంటే ఎక్కువగా ఓట్లు ఉంటే వారిని గుర్తించి వారంతా అక్కడే నివాసముంటున్నారా? లేదా? అనే విషయంపై సర్వే చేయాలని కోరారు. ఒక వేళ అరుగురు కంటే ఎక్కువగా ఉంటే అదే ఇంటిపైన బై నంబర్ ఇచ్చి ఆ ఓట్లను కొనసాగించాలని సూచించారు. బోగస్ ఓట్లు ఉంటే వాటిని తొలగించేందుకు సదరు ఇంటి యజమాని నుంచి స్వయంగా డిక్లరేషన్ తీసుకున్న తర్వాత వాటిని తొలగించనున్నామని మారుతీదివాకర్ తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో చేసుకోవాలని చేసుకున్న తర్వాత బూత్‌లెవల్ అధికారులు ఆ ఓట్లను వెరిఫికేషన్ చేసిన తర్వాత కొత్త ఓటరుగా నమోదు ప్రక్రియ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

మంత్రి సబితారెడ్డి

- జల్‌పల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జల్‌పల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి సబిత

పహాడీషరీఫ్: మహేశ్వరం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన కోట్లాది రూపాయలతో మున్సిపాలిటీలలో మెరుగైన సదుపాయా లు కల్పించనున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితారె డ్డి అన్నారు. జల్‌పల్లి గ్రామంలోని 16వ వార్డులో రూ.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, 17వ వార్డులో రూ.39 లక్షలతో సీసీ రోడ్డు, 16వ వార్డులోనే రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ, బీటీ రోడ్డు పనులకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. మన ఊరు–మన బడి పథకంలో భాగంగా జల్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.44 లక్షలతో చేపట్టిన పనులు, రూ.15 లక్షలతో అర్బన్ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు పనులను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. ఇటీవల మహేశ్వరానికి ప్రకటించిన రూ.168 కోట్లు కాకుండా నియోజకవర్గానికి రెండు నెలల క్రితం ముఖ్యమంత్రి రూ.100 కోట్లు మంజూరు చేయగా.. అందులో రూ.45 కోట్లు జల్‌పల్లికే కేటాయించామని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల 56 అర్బన్ ఫారెస్టు పార్కులను కూడా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. జల్‌పల్లి గేటు వద్ద అందుబాటులోకి తెచ్చిన పార్కులో త్వరలోనే ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. చక్కటి ఆరోగ్యం కోసం మున్సిపాలిటీ ప్రజలు ఈ పార్కును వినియోగించుకోవాలని కోరారు. మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో మంచినీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేశామని, త్వరలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన కృష్ణానీటిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కో–ఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు యాదగిరి, ప్రశాంతి శ్రీధర్ గౌడ్, నాయకులు షేక్ జహంగీర్, జనార్దన్, కైసర్ బామ్, యంజాల అర్జున్, సుధాకర్ గౌడ్, షేక్ అఫ్జల్, యూసుఫ్ పటేల్, డీఎఫ్ఓ విజయానందరావు పాల్గొన్నారు.

మీర్‌పేట అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

మీర్‌పేట: ప్రత్యేక ప్రణాళికతో మీర్‌పేట కార్పొరేషన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ ఒకటవ డివిజన్ మైత్రిపురం కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, 21వ వార్డు న్యూ వెంకటేశ్వరకాలనీ, గాయత్రిహోమ్స్ కాలనీలో రూ.50 లక్షలతో చేపట్టే సీసీరోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో మీర్‌పేట కార్పొరేషన్‌కు రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. బడంగ్‌పేట, మీర్‌పేట, జల్‌పల్లి పరిధిలోని 10 చెరువులను రూ.40 కోట్లతో సుందరీకరణ, పట్టణ ప్రగతిలో భాగంగా సమీకృత మార్కెట్, వైకుంఠధామాల నిర్మాణం, మూడు మున్సిపాలిటీలకు రూ.150 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం

పహాడీషరీఫ్: మన ఊరు–మన బడి పథకంలో భాగంగా జల్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనుల పట్ల మంత్రి సబితారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె అన్ని తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా విద్యాశాఖ సూచనలకు అనుగుణంగా సదుపాయాలు సమకూర్చకపోవడం పట్ల మున్సిపాలిటీ డీఈ, ఏఈలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులలో తక్కువ ఫ్యాన్లు .. తక్కువ ట్యూబ్‌లైట్లు, కిటికీలు ధ్వంసమై ఉండటం.. కొన్ని తరగతి గదులలో ఫ్లోరింగ్ చేయకపోవడం చూసి విస్మయాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా బాధ్యతతో నడుచుకోవాలని సూచించారు.



జల్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి

కాలనీల్లో సమస్యలను పరిష్కరిస్తా

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఎన్జీఓస్‌కాలనీలోని లేబర్ అడ్డా వద్ద పగిన డ్రైనేజీ పైప్‌లైన్ వల్ల మురుగునీరు రోడ్లపై పారడంతోందని కాలనీవాసులు ఇచ్చిన సమాచారం మేరకు జలమండలి అధికారులతో కలిసి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పగిలిన డ్రైనేజీ పైప్‌లైన్లకు వెంటనే మరమ్మతులు చేయాలని జలమండలి అధికారులను కోరారు. డివిజన్లలో ఎక్కడెక్కడ మురుగునీటి సమస్య ఉందో వెంటనే అధికారులు గుర్తించాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ భవ్యారెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

నక్షబాటను సరి చేయాలి

తహసీల్దార్‌కు బద్నాపూర్ గ్రామస్తుల వినతి

తలకొండపల్లి: నక్షబాటను సరి చేయాలని బద్నాపూర్ గ్రామస్తులు తహసీల్దార్ కృష్ణకు శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బద్నాపూర్ నుంచి లేమామిడికి వెళ్లనున్న నక్షబాటను చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లోని పట్టాదారులు బాటను ఆక్రమించి రాకపోకలకు అంతరాయం కల్పించారు. సంబంధిత అధికారులచే సర్వే చేయించి నక్షబాటను పునరుద్ధరించాలని వారు త హసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, వెంకటయ్య, శంకరయ్య, పెంటారెడ్డి, శేఖర్, చెన్నయ్య, జంగయ్య పాల్గొన్నారు.